# సాక్షి
## పశ్చిమగోదావరి

మంగళవారం । 14 । మే । 2024




### శ్రీవారి సేవలో..

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని ఎన్నికల వ్యయ పరిశీలకులు పి.కీర్తి నారాయణ్, గౌరవ్ సోమవారం సందర్శించారు. ప్రత్యేక పూజలు చేయించారు.



### పోలింగ్ బహిష్కరణ

కొయ్యలగూడెం మండలంలోని నరిపల్లి పంచాయతీ పరిధిలోని వంకబొత్తప్పగూడెం గిరిజనులు పోలింగ్‌ను బహిష్కరిస్తూ ఆందోళనకు దిగారు. 8లో ▸

### మహిళ దారుణ హత్య



కొయ్యలగూడెం మండలం యర్రంపేటలో గ్రామంలో సోదెం అరుణ అనే మహిళ దారుణ హత్యకు గురైంది. ఎస్సై విష్ణువర్ధన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.
8లో

## న్యూస్‌రీల్

### పోలింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలం

**డిప్యూటీ సీఎం కొట్టు**

**తాడేపల్లిగూడెం:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సరళి వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉందని డిప్యూటీ సీఎం, తాడేపల్లిగూడెం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలో ఆయన మాట్లాడుతూ ఓటు వేయడానికి వచ్చిన ప్రజల హావభావాలు చూస్తుంటే ఇది స్పష్టమవుతుందన్నారు. ఓటర్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, జగనన్న సంక్షేమంపై పూర్తి సానుకూల దృక్పథంతో ఓటు వేశారని అభిప్రాయపడ్డారు. ఓటర్లు పెద్దసంఖ్యలో తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. తాడేపల్లిగూడెంలో ప్రశాంత వాతావరణం నిలబెట్టడానికి ఓటర్లు స్పందించినట్టుగా ఉందన్నారు.

### రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం

**మంత్రి కారుమూరి నాగేశ్వరరావు**

**అత్తిలి:** రాష్ట్రం అంతటా ఫ్యాన్ ప్రభంజనం కనిపిస్తోందని తణుకు నియోజవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అత్తిలిలో ఓటుహక్కు వినియోగించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే వైఎస్సార్‌సీపీ గెలుపునకు దోహదపడతాయన్నారు. రాష్ట్రంలో వీస్తున్న ఫ్యాన్ గాలికి కూటమి కొట్టుకుపోవడం ఖాయమన్నారు.

### వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

**పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు**

**పెనుగొండ:** ఆచంట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించనుందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఆచంట నియోజకవర్గ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం తూర్పుపాలెంలో ఓటు హక్కును వినియోగించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల కోసం సీఎం జగన్‌కు మహిళలు బాసటగా నిలిచారన్నారు. చంద్రబాబు, కూటమి నాయకులు ఎన్ని కుయుక్తులు పన్నినా, దుష్ప్రచారాలు చేసినా ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు. ఉదయం నుంచి ఆచంటేశ్వరుని దర్శించుకుని నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

### స్ట్రాంగ్‌రూమ్స్ పరిశీలన



**అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ అజిత**

**భీమవరం:** ఎన్నికల పోలింగు ప్రక్రియ అనంతరం ఆచంట, తణుకు, పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ వేజెండ్ల అజితతో కలసి కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ఆయా నియోజక వర్గాల నుంచి వచ్చే ఈవీఎంలు, ఇతర సామగ్రిని జాగ్రత్తగా తీసుకుని స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరచాలని దిశానిర్దేశం చేశారు. అలాగే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజన వసతులు కల్పించాలన్నారు. వీరి వెంట ఎన్నికల అధికారులు, పోలీస్, సర్వే అధికారులు ఉన్నారు.

### పటిష్ట బందోబస్తు



**పోలింగ్ కేంద్రాల వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల**

**భీమవరం:** ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా ఎన్నికలే లక్ష్యంగా పోలీసు సిబ్బంది పనిచేయాలని, ఓటర్లు స్వేచ్ఛగా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తోడ్పాటు అందించాలని జిల్లా ఎస్పీ వేజెండ్ల అజిత అన్నారు. సోమవారం జిల్లాలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల సరళి పోలింగ్ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, నరసాపురం డీఎస్పీ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో ఓటు హక్కు వినియోగించుకున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తూర్పుపాలెంలో ఓటేసిన ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు



అత్తిలిలో ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి కారుమూరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్



భీమవరంలో ఓటేస్తున్న విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల



గునుపూడిలో ఓటేసిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

# ఓటెత్తారు

### పోలింగ్ ప్రశాంతం

- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- ఉవ్వెత్తున ఓటరు చైతన్యం
- నిర్దిష్ట సమయానికి మించి పోలింగ్
- జిల్లాలో 82.08 పోలింగ్ శాతం నమోదు
- అత్యధికం పాలకొల్లులో 83.1 శాతం
- అత్యల్పం భీమవరంలో 78.42 శాతం

సాక్షి, భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ప్రక్రియ పశ్చిమగోదావరి జిల్లాలో చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచే కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. నిర్దిష్ట సమయం దాటినా రాత్రి వరకు చాలా కేంద్రాల వద్ద పోలింగ్ కొనసాగింది. జిల్లావ్యాప్తంగా 82.08 శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా పాలకొల్లు నియోజకవర్గంలో 83.1 శాతం పోలింగ్ నమోదు కాగా, భీమవరం నియోజకవర్గంలో 78.42 శాతంతో తక్కువ పోలింగ్ జరిగింది.

నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం, భీమవరం, ఆచంట, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం అసెంబ్లీ స్థానాలకు జిల్లావ్యాప్తంగా 1,463 కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. ఉదయం 6 గంటల సమయంలో పోలింగ్ కేంద్రాల్లోని రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ మొదలైంది. ఉండి మండలం వాంద్రంలోని 114 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ గంట పాటు ఆలస్యంగా మొదలైంది,

**పోలింగ్ శాతం ఇలా..**

మునుపెన్నడూ లేనివిధంగా గత ఐదేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకున్న ఓటర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటుతో తమ మద్దతు తెలిపేందుకు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. పలు కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల కంటే ముందే ఓటర్లు బారులు తీరి కనిపించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా ఓటర్లు బారులు తీరి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రతి రెండు గంటలకు అధికారులు పోలింగ్ శాతంను విడుదల చేస్తూ వచ్చారు. ఉదయం 9 గంటల సమయానికి జిల్లాలో 9.61 శాతం పోలింగ్ నమోదు కాగా 11 గంటల సమయానికి 23.26 శాతం, మధ్యాహ్నం 1 గంట సమయానికి 39.06 శాతం, 3 గంటల సమయానికి 53.67 శాతం, సాయంత్రం 5 గంటల సమయానికి 68.36 శాతం, రాత్రి 11 గంటల సమయానికి 82.08 శాతం పోలింగ్ నమోదైంది. నిర్దిష్ట సాయంత్రం 6 గంటల సమయానికి పోలింగ్ ముగియాల్సి ఉండగా అధిక శాతం పోలింగ్ కేంద్రాల వద్ద ఇంకా ఓటర్లు బారులు తీరి ఉండటంతో వారికి ఓటేసేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పించి పోలింగ్‌ను కొనసాగించారు. దీంతో రాత్రి 11 గంటల వరకు కూడా పలు నియోజకవర్గాల్లో పోలింగ్ కొనసాగింది.



తణుకు మండలం తేతలిలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన మహిళలు

**17.72 లక్షల మంది ఓటర్లు**

జిల్లాలో 17,72,923 మంది ఓటర్లకు గాను పురుషులు 7,21,532 మంది, మహిళలు 7,51,313 మంది మహిళలు, ఇతరులు 72 మంది ఉన్నారు. 1,92,544 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 93,924, మహిళలు 98,616, ఇతరులు నలుగురు ఉన్నారు. పురుషుల కంటే 4,692 మంది మహిళలు అధికంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు.



పాలకొల్లులో ఎస్ఎస్ఎన్ స్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు



ఆకివీడు మండలం దుంపగడపలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల రద్దీ

**పోలింగ్ శాతం ఇలా..**

| నియోజకవర్గం | ఓటర్లు | ఉ.9 గంటలు | 11 గంటలు | మ.1 గంట | 3 గంటలు | 5 గంటలు | రాత్రి కి.. |
|---|---|---|---|---|---|---|---|
| ఆచంట | 1,80,017 | 11.00 | 25.80 | 42.47 | 58.40 | 72.30 | 82.79 |
| పాలకొల్లు | 1,95,057 | 11.00 | 24.06 | 39.26 | 56.29 | 72.10 | 83.10 |
| నరసాపురం | 1,70,448 | 8.72 | 23.02 | 38.95 | 54.27 | 69.80 | 80.28 |
| భీమవరం | 2,53,116 | 9.12 | 22.67 | 36.42 | 47.90 | 63.20 | 78.42 |
| ఉండి | 2,24,725 | 10.45 | 25.30 | 41.93 | 56.02 | 71.31 | 82.10 |
| తణుకు | 2,34,575 | 8.78 | 21.28 | 37.29 | 52.56 | 65.65 | 82.08 |
| తాడేపల్లిగూడెం | 2,14,985 | 8.20 | 21.32 | 38.14 | 52.04 | 66.50 | 79.81 |



నరసాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



పాలకొల్లులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి



తణుకులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



ఉండి మండలం యండగండిలో ఓటేసిన ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు



భీమవరంలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ దంపతులు



పాలకొల్లులో వృద్ధురాలిని చేతులపై ఎత్తుకుని తీసుకువస్తున్న యువకుడు

# గూడెంలో బొలిశెట్టి దౌర్జన్యకాండ

- పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి కొట్టుపై బొలిశెట్టి అనుచరుల కవ్వింపు చర్యలు
- అడ్డుకునే ప్రయత్నం చేసిన మంత్రి తనయుడు విశాల్‌పై దాడి

సాక్షి, భీమవరం: తాడేపల్లిగూడెంలో జనసేన పార్టీ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ ఆగడాలు పెచ్చుమీరుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల వేళ అనుచరులను ప్రత్యర్థులపై కవ్వింపు చర్యలకు ఉసిగొల్పి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఆయన వ్యవహారశైలి ఉందని వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నారు. సోమవారం పోలింగ్ సందర్భంగా పెంటపాడు మండలం అలంపురంలో జనసేన నాయకులు రెచ్చిపోయి వీరంగం సృష్టించిన తీరు గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులకు కారణమైందంటున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ గ్రామంలోని 165 పోలింగ్‌బూత్‌ను సందర్శించేందుకు వచ్చారు. పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తుండగా అక్కడే ఉన్న జనసేన నాయకులు ఆయనపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. అక్కడితో ఆగకుండా మంత్రి కొట్టు వెంట ఉన్న ఆయన తనయుడు విశాల్‌ను రెచ్చగొట్టే విధంగా దూషణలు చేస్తూ కయ్యానికి కాలుదువ్వారు. ఆయనపై దాడికి యత్నించారు. వారి ఆగడాలను వైఎస్సార్‌సీపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుని ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైఎస్సార్‌సీపీ నాయకులపైనా అల్లరిమూకలు దాడికి యత్నించాయి. తాడేపల్లిగూడెం డీఎస్పీ మూర్తి జోక్యం చేసుకుని ఇరువర్గాల వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా 144 సెక్షన్ అమలులోకి తెచ్చారు.



తాడేపల్లిగూడెంలో పోలీసులతో వాగ్వాదం చేస్తున్న జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్

**పట్టణంలోనూ..**

పట్టణంలోని సుబ్బరావుపేట వెంకటరత్నం ఆస్పత్రి వద్ద ఉన్న 97వ పోలింగ్ కేంద్రంలో టీడీపీ నాయకులు ఉద్రిక్త పరిస్థితులకు తెరలేపారు. 97, 98 పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నియమావళికి విరుద్ధంగా జనసేన కేడర్ ప్రచారం చేస్తున్నట్టు సమాచారం అందడంతో మంత్రి కొట్టు సత్యనారాయణ అక్కడకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని వైఎస్సార్‌సీపీ నాయకులపై దూషణలకు దిగారు. అడ్డుకోబోయిన పోలీస్ అధికారులతోను ఆయన వాగ్వాదానికి దిగారు. మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రత్యర్థులకు దీటుగా బదులిచ్చారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తగా పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దుమణిగింపచేశారు. ఎన్నికల్లో పరాజయం తప్పదన్న అసహనంతో బొలిశెట్టి ఏదో విధంగా తమను రెచ్చగొట్టి గొడవలు సృష్టించాలని చూశారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడుతున్నారు.



తేతలిలో రాత్రి 9 గంటలకు పోలింగ్ కేంద్రంలో ఓటర్లు



నరసాపురం మండలం సీతారామపురంలో బారులు తీరిన ఓటర్లు



పాలకొల్లులో కాలుకు కట్టుతో యువతి..

# పెదతాడేపల్లిలో చోరీ ?

**తాడేపల్లిగూడెం (టీఓసీ):** పెదతాడేపల్లి ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు తెలిసింది. సబ్‌స్టేషన్ సమీపంలోని ఓ బిల్డింగ్‌లో నివాసం ఉంటున్న ఓ కుటుంబం ఇటీవల గ్రామాంతరం వెళ్లి సోమవారం తిరిగి రాగా, ఇంటితాళాలు బద్దలు కొట్టి ఉండటం, ఇంట్లో ఉండాల్సిన ఏడు కాసుల బంగారం ఆభరణాలు కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించినట్లు తెలిసింది. కాగా ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.





**ఆకివీడు :** దుంపగడపలో ఓటు వేసేందుకు నడిచి వస్తున్న వృద్ధురాలు



**పాలకోడేరు :** పెన్నాడ అగ్రహారంలో ఓటు వేసేందుకు వెళుతున్న ఓ వృద్ధురాలు



**మొగల్తూరు :** మొగల్తూరులో దయాల్‌దాస్‌పేట బూత్‌లో ఓటేసేందుకు వస్తున్న వృద్ధురాలు



**భీమవరం అర్బన్ :** తాడేరులో వృద్ధురాలిని ఓటు వేసేందుకు మోసుకెళుతున్న దృశ్యం



**పాలకోడేరు:** శృంగవృక్షంలో మనవరాలి సాయంతో వీల్‌చైర్‌లో వచ్చిన వృద్ధుడు రేలంగి బలరాంమూర్తి

# ముదిమిలోనూ మురిపెం

## వీల్‌చైర్లలో, నడుచుకుంటూ పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చిన దివ్యాంగులు, వృద్ధులు
## ఉత్సాహంగా ఓటు వేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచిన పండుటాకులు



**తాడేపల్లిగూడెం:** 93 ఏళ్ల ఉంగరాల వీరరాఘవమ్మ

ముదిమిలోనూ ఉత్సాహంగా ఓటు వేసి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచారు పలువురు వృద్ధులు. వయస్సు మళ్లినా లెక్కచేయకుండా నడుచుకుంటూ, కొందరు వీల్ చైర్‌లో ఇలా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. వృద్ధులతో పాటు పలువురు దివ్యాంగులు కూడా జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఓటు వేశారు. బంధువులు, పోలీసులు, కొందరు ఓటర్లు వీరికి మానవతా దృక్పథంతో వీరికి సాయమందించారు.

– సాక్షి, నెట్‌వర్క్



**పాలకోడేరు :** శృంగవృక్షంలో ఓటు వేసిన వృద్ధుడు పెద్దిరెడ్డి అప్పారావు



**మొగల్తూరు :** శ్రీహరిపేటలో ఓటు వేయడానికి వచ్చిన వృద్ధురాలు



**పాలకొల్లు అర్బన్ :** పాలకొల్లులో అల్లు వెంకటేశ్వరరావు మునిసిపల్ స్కూలు వద్ద వృద్ధుడ్ని వీల్‌చైర్‌లో తీసుకువస్తున్న కానిస్టేబుల్



**ఉండి:** వాండ్రంలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో..



**నరసాపురం రూరల్ :** సీతారామపురంలో ఓ వ్యక్తికి సాయం చేస్తున్న ఓటర్లు



**అత్తిలి :** అత్తిలిలో వీల్‌చైర్‌పై వచ్చిన ఓ వృద్ధురాలు



**పెనుగొండ:** చిన్నంవారిపాలెంలో వృద్ధురాలిని ఆటోలో తీసుకువస్తున్న స్థానికుల



**ఆకివీడు :** దుంపగడపలో ఓటు వేసి తిరిగి వెళుతున్న వృద్ధురాలు



## ఓటు వేయడానికి వచ్చి వృద్ధుడి మృతి



ఆశీర్వాదం మృతదేహం

**భీమవరం అర్బన్ :** డేగాపురంలోని పోలింగ్ కేంద్రంలో సోమవారం ఓటు వేసేందుకు వచ్చి ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పిల్లి ఆశీర్వాదం (60) గత కొద్ది నెలల క్రితం గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్దనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉదయయే గ్రామంలోని 83వ నంబర్ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఆశీర్వాదం క్యూలైన్‌లో నిలబడ్డారు. అయితే ఈవీఎం సుమారు రెండు గంటలు మొరాయించడంతో క్యూలైన్‌లో నిలబడిన ఓటర్లు అలసటకు గురయ్యారు. అసలే వృద్ధుడు, పైగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ఆశీర్వాదం అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే బంధువులు భీమవరంలోని ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఆశీర్వాదం మృతి చెందినట్లు నిర్ధారించారు.

## ఓటేసి వెళుతూ మృత్యుఒడికి..

**పాలకొల్లు అర్బన్ :** చింతపర్రులో ఓటు వేసి ఇంటికి వెళుతుండగా ప్రమాదానికి గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన తానేటి నాగమణి (68) ఓటు వేసేందుకు తన కుమారుడి మోటార్‌సైకిల్‌పై పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఓటు వేసిన అనంతరం ఆమె మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళుతూ ప్రమాదవశాత్తూ జారిపడిపోయారు. దీంతో ఆమెను ఇంటికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స అందించే లోపే ప్రాణాలు కోల్పోయారు. నాగమణికి ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త చాలా రోజుల క్రితమే చనిపోయారు. ఆమె వృద్ధాప్య పింఛను ప్రతి నెలా అందుకుంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఓటు వేయడానికి వచ్చి నేత కార్మికుడి మృతి



మృతుడు ప్రభాకరరావు

**కై కలూరు:** ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఎంతో ఉత్సాహంగా వచ్చి 'క్యూ' లైన్‌లో నిలబడిన వ్యక్తి మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా కై కలూరు మండలం వింజరం గ్రామంలో సోమవారం జరిగింది. వింజరం పంచాయతీ శివారు సాలిపేటకు చెందిన గోనె ప్రభాకరరావు (65) చేనేత కార్మికుడు. భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేశారు. ఆయన గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన 167వ నంబర్ పోలింగ్ బూత్‌లో ఓటు వేయడానికి మధ్యాహ్నం వచ్చారు. క్యూలైన్‌లో నిలుచుని ఉన్న ప్రభాకరరావు కొద్దిసేపటికి ఒక్కసారిగా కుప్పకూలారు. స్థానికులు వెంటనే స్పందించి హుటాహుటిన కైకలూరు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ప్రభాకరరావు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని గ్రామానికి తరలించారు. ఓటు వేయడానికి ఉత్సాహంగా వచ్చిన గ్రామస్తుడు విగతజీవిగా మారడంతో ప్రతి ఒక్కరూ కన్నీరు పెట్టుకున్నారు.

## యర్రంపేటలో మహిళ దారుణ హత్య

**కొయ్యలగూడెం :** యర్రంపేటలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఎస్సై జీజే విష్ణువర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో నివాసం ఉంటున్న సోదెం అరుణ (32) సోదరికి రాజవరం గ్రామానికి చెందిన దారం రాంబాబుతో వివాహమైంది. అయితే సోదరి మృతి చెందింది. ఈ క్రమంలో రాంబాబుతో సోదెం అరుణకు వివాహేతర సంబంధం ఏర్పడింది. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో గత కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అరుణపై అనుమానంతో ఆమెను అంతమొందించాలని రాంబాబు పథకం పన్నాడు. దీనిలో భాగంగా కత్తితో అరుణ ఇంట్లోకి ప్రవేశించగా, నిద్రిస్తున్న ఆమె పీక కోసి రాంబాబు పరారయ్యాడు. ఈ ఘటనలో అరుణ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్సై సిబ్బందితో కలిసి సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని రక్తపు మడుగులో పడి ఉన్న మహిళ మృతదేహాన్ని, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మొరాయించిన ఈవీఎంలు.. ఆలస్యంగా పోలింగ్



కడియద్దలో గొడవలను నియంత్రించడానికి వచ్చిన నాగాలాండ్ బెటాలియన్



కొమ్ముగూడెంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం దృశ్యం

**తాడేపల్లిగూడెం:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో సోమవారం నిర్వహించిన పోలింగ్ సందర్భంగా పలు చోట్ల వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ముందుకు సాగలేదు. జగ్గన్నపేటలో 24వ నంబర్ పోలింగ్‌స్టేషన్‌లో ఉదయం ఏడు గంటల నుంచి 8.15 వరకు ఈవీఎం పనిచేయలేదు. పెంటపాడు మండలం పరిమెళ్ల గ్రామంలో 194వ నంబర్ పోలింగ్ స్టేషన్‌లో ఎంపీ అభ్యర్థికి సంబంధించిన ఈవీఎం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మొరాయించింది. దీంతో మరో ఈవీఎం తీసుకొచ్చి పోలింగ్ నిర్వహించారు. పలుచోట్ల ఉదయం మాక్ పోలింగ్ ఆలస్యం కావడం, ఈవీఎంల మొరాయింపు కారణంగా పోలింగ్ ఆలస్యమైంది. నియోజకవర్గంలో పోలింగ్ సందర్భంగా పలు ప్రాంతాలలో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. మండలంలో జనసేన నాయకులకు, వైఎస్సార్ సీపీ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్తతకు దారితీస్తున్న తరుణంలో పోలీసులు నాగాలాండ్ ఫోర్స్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అక్కడినుంచి పంపించి గొడవను నివారించారు. కొమ్ముగూడెంలో తెలుగుదేశం నాయకులు వైఎస్సార్ సీపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. పట్టణంలోని 118వ నంబర్ పోలింగ్‌స్టేషన్‌లో టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. 154వ నంబర్ పోలింగ్‌స్టేషన్‌లోకి వెళ్లే విషయంలో టీడీపీ నాయకుడు గొర్రెల శ్రీధర్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొర్రెల శ్రీనుకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి చేయి దాటిపోకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

# వంకబొత్తప్పగూడెంలో పోలింగ్ బహిష్కరణ

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్న అధికారుల హామీతో సజావుగా పోలింగ్**



వంకబొత్తప్పగూడెంలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

**కొయ్యలగూడెం:** సరిపల్లి పంచాయతీ పరిధిలోని వంకబొత్తప్పగూడెం గిరిజన గ్రామస్తులు సోమవారం పోలింగ్‌ను బహిష్కరిస్తూ ఆందోళనకు దిగారు. ఎంపీపీ స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ వద్ద గ్రామస్తులు అంతా ఏకమై తాము ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు పేర్కొంటూ నిరసన వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా కొయ్యలగూడెం మండలంలోని గిరిజన గ్రామాలను అన్నీ కలిపి ఒక పంచాయతీగా చేయాలని, అదేవిధంగా తమను ఐటీడీఏ పరిధిలోకి తీసుకురావాలంటూ డిమాండ్ చేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వాలు కూడా తమ గోడును పట్టించుకోలేదని వాపోయారు. ప్రతి సార్వత్రిక ఎన్నికల సమయంలోనూ తాము ఎన్నికలను బహిష్కరించడం, తరువాత అధికారులు వచ్చి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరుగుతుందే గాని తమకు న్యాయం జరగడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ జయలక్ష్మి, ఎస్సై జీజే విష్ణువర్ధన్ గ్రామస్తులతో చర్చించి వారి డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోలింగ్ సజావుగా కొనసాగింది.

# అధికారుల అత్యుత్సాహం.. వైఎస్సార్ సీపీ ఓట్లకు గండి

**ముసునూరు:** సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఏజెంట్ల ప్రవర్తన, అధికారుల అత్యుత్సాహంతో వైఎస్సార్ సీపీ ఓట్లకు గండి పడింది. సోమవారం మండల వ్యాప్తంగా 57 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ అధికారులు పలు చోట్ల అధికార పార్టీకి వ్యతిరేకంగా, టీడీపీ గెలిపించడానికి శతవిధాలా ప్రయత్నం చేశారు. మండల కేంద్రం ముసునూరులోని 79వ పోలింగ్ బూత్‌లో ఓటర్లు దేవినేని శ్రీవర్షిణి కెనడా, తులిమెల్లి రవికిషోర్ అమెరికాలో ఉన్నారు. దీనిపై ముందే ప్రణాళిక సిద్ధం చేసుకున్న టీడీపీ ఏజెంట్లు, పోలింగ్ అధికారితో కుమ్మక్కై, వైఎస్సార్ సీపీ ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలోకి రాకముందే స్థానికులతో దొంగ ఓట్లు వేయించారు. మరికొన్ని చోట్ల టీడీపీ కార్యకర్తలు ప్రతి చిన్న విషయాన్ని రాద్ధాంతం చేస్తూ, కవ్వింపు చర్యలకు దిగారు. దీనికి తోడు గోపవరంలోని 96వ పోలింగ్ బూత్‌లో వృద్ధురాలు ఓటు వేయడానికి రాగా, పోలింగ్ అధికారి ఎంపీ అభ్యర్థికి ఓటు వేయించి, ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేయకుండా అడ్డుకుని ఫ్యాన్ గుర్తుకు వేయాలని ఆమె కోరినా వినకుండా, సైకిల్ గుర్తుకు ఓటు వేయించింది. ఆమెతో పాటు వచ్చిన కోడలు ఈ విషయాన్ని గుర్తించి అధికారిని నిలదీసింది. దీంతో ఆ అధికారి దండాలు, దస్కాలు పెడుతూ ఆమెను క్షమాపణ కోరాడు. రెండు చోట్లా వైఎస్సార్ సీపీ ఏజెంట్లు, నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించి, ఘర్షణ వాతావరణాన్ని నివారించారు.

# ఓటు వేసేందుకు ఉత్సాహంగా కదిలిన జనం


గూడెంలో ఓటు కోసం బారులు తీరిన ఓటర్లు


పెంటపాడు: పంచాయతీ కార్యాలయం వద్ద బారులు తీరిన ఓటర్లు

- ఓటు కోసం బారులు తీరిన ఓటర్లు
- ఓటు హక్కు వినియోగించుకున్న పలువురు ప్రముఖులు

**తాడేపల్లిగూడెం:** సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోడానికి నియోజకవర్గ ఓటర్లు సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం పోలింగ్ కాస్త మందకొడిగా సాగింది. సాయంత్రం ఆరు గంటల సమయానికి నియోజకవర్గంలో మొత్తం 1,51,441 మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 73,868 మంది పురుషులు కాగా, మహిళలు 77,566 మంది, ఇతరులు ఏడుగురు ఉన్నారు. పోలింగ్ శాతం ఈ సమయానికి 70.4 శాతమైంది. సార్వత్రిక ఎన్నికలలో సోమవారం అభ్యర్థులు, ప్రముఖులు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం, పట్టణంలోని ఈవీఎం హైస్కూల్‌లోని 115 నంబరు బూత్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే ఈలి నాని కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నారు. ఈ పోలింగ్ పూర్తి కావడానికి రాత్రి పదిగంటల వరకు సమయం పట్టేలా ఉంది. స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంలను ఈ ప్రక్రియ పూర్తయ్యిన వెంటనే పంపించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు బస్సులను సిద్ధం చేశారు. సాయంత్రం ఏడు గంటల సమయానికి నియోజకవర్గంలో పురుషులు 80,853 మంది, మహిళలు 84,745 మంది, ఇతరులు ఏడుగురు మొత్తం 1,65,605 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం ఎస్సీ ఓటర్లు ఉన్న గ్రామం వెంకట్రావుపాలెంలో మధ్యాహ్నానికే అధిక శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం


ఓటు వేసినట్టు చూపిస్తున్న త్రీఎఫ్ బాధ్యులు ఓపి.గోయంకా

**ఓటేయడానికి వచ్చిన వృద్ధులు**
సార్వత్రిక ఎన్నికల్లో సీనియర్ సిటిజన్లు ఓటేయడానికి సోమవారం పట్టణంలోని వివిధ బూత్‌లకు వచ్చారు. ఉత్సాహంగా కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. ఓటేసిన ఆనందం వారి కళ్లల్లో కనపడింది. వీల్‌చైర్లలో, కుటుంబసభ్యుల సహకారంతో వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**మండలంలో పోలింగ్ ప్రశాంతం**
**పెంటపాడు:** మండలంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. చిన్నపాటి సమస్యలు తప్ప పోలింగ్‌కు ఏ విధమైనా ఆటంకం కలగలేదు. ముదునూరుపాడు మాగంటి అన్నపూర్ణాదేవి స్కూలు, పెంటపాడులో 173,174 కేంద్రాల్లో ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం ఓటర్లు బారులు తీరారు. పరిమెళ్లలో జెడ్పీస్కూల్లో రెండు కేంద్రాల్లో ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు ఓటర్లు క్యూలో నిలబడి ఓటు వేసేందుకు బారులు తీరారరు. మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా సాగింది.


ఓటు వేయడానికి వచ్చిన 90 సంవత్సరాల నున్న సరోజని

## చెదురు మదురు ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతం


మాధవరంలోని పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం 6 గంటలకు బారులు తీరిన ఓటర్లు

**తాడేపల్లిగూడెం రూరల్:** మండలంలో చెదురు మదురు ఘర్షణలు మినహా సోమవారం పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. ఉదయం 6.30 గంటలకే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు చేరుకున్నారు. తదుపరి ఎండ తీవ్రత పుంజుకోవడంతో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వచ్చేందుకు సుముఖత చూపలేదు. సాయంత్రం 4 గంటల నుంచి పోలింగ్ కేంద్రాలకు మహిళా ఓటర్లు పోటెత్తారు. దీంతో సాయంత్రం 6 గంటలకు సైతం మెట్ట ఉప్పరగూడెం, మాధవరం, జగన్నాథపురం, పెదతాడేపల్లి, ఆరుగొలను, నవాబుపాలెం తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిక్కిరిసి కనిపించాయి. మహిళలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని భారీ క్యూలో నిలబడ్డారు. ఎండను సహితం లెక్క చేయకుండా క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు కూడా ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వచ్ఛందంగా కేంద్రాలకు వచ్చారు. ఓటర్లకు ఆటోలు, ఇతర వాహనాలను ఆయా పార్టీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అత్యధికంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరి నిలబడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు జరిపి సంక్షేమ పథకాలకు మద్దతు తెలుపుతూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెబుతున్నారు. కొండ్రుప్రోలు, మాధవరం గ్రామాల్లో చిన్నపాటి ఘర్షణలు చోటుచేసుకున్నాయి. అయితే పోలీస్, ప్రత్యేక బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని ఆకతాయిలను చెల్లాచెదురు చేశారు.

## క్లుప్తంగా

### బ్రహ్మలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో బ్రహ్మలింగేశ్వర స్వామి

**పెంటపాడు:** మండలంలోని పెంటపాడు పెద్ద శివాలయంలో పార్వతి బ్రహ్మలింగేశ్వరునికి సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయ ట్రస్టు ప్రతినిధి కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### పెంటపాడు పీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు


పెంటపాడు పీహెచ్‌సీలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ మౌనిక

**పెంటపాడు:** మండలంలోని పెంటపాడు ఆరోగ్య కేంద్రంలో సోమవారం 25 మంది గర్భిణులకు డాక్టర్ తోట రాజేష్, డాక్టర్ మౌనికలు పరీక్షలు చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సుజాత, తేజోనాథ్, సాయి, ఎంపీహెచ్‌ఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### యువతలో ఉత్సాహం


ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువత

**పెంటపాడు:** పెంటపాడులో యువత, కొత్త ఓటర్లు తమ ఓటు హక్కు మొదటిసారి వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపించారు. కుటుంబాలతో వచ్చి మరీ ఓటు వేయటం విశేషం. యువత ఎండలోనూ క్యూలైన్లలో నిలుచుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లోనూ పదుల సంఖ్యలో యువత ఉండడం విశేషం.

### సేవలందించిన ఎన్‌సీసీ విద్యార్థులు


భీమవరంలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లను క్రమపద్ధతిలో పంపిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థి

**భీమవరం:** పట్టణంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భీమవరం డీఎన్నార్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు సేవలందించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ ఎ వీరయ్య పర్యవేక్షణలో ఎన్‌సీసీ విద్యార్థులు పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేయడానికి వచ్చిన వారిని క్రమపద్ధతిలో పోలింగ్ బూత్‌లకు పంపించారు. వృద్ధులు, వికలాంగులను దగ్గరుండి బూత్ లోపలికి తీసుకువెళ్లి ఓటు వేయించడానికి సహకరించారు.

### ఓటు వేసిన ప్రముఖులు


ఓటు వేయడానికి వచ్చి చేతిపై సిరా చుక్కు వేయించుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**భీమవరం:** సార్వత్రిక ఎన్నికల సందర్భంగా సోమవారం పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలోని బూత్ నంబర్ 116లో కలెక్టర్ సుమిత్‌కుమార్ దంపతులు ఓటువేశారు. అలాగే భీమవరం పట్టణంలోని గునుపూడి 117 బూత్‌లో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఓటు వేయగా, ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ నాచువారి సెంటర్‌లోని పొట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లోని బూత్‌లో ఓటు వేశారు. నరసాపురం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల కుటుంబసభ్యులతో కలసి చింతలపాటి అచ్చుతరామరాజు మునిసిపల్ స్కూల్లోని 130వ పోలింగ్ బూత్‌లో ఓటు వేయగా ఆమె వెంట క్రిస్టియన్ మైనార్టీసెల్ చైర్మన్ మేడిది జాన్సన్ కూడా ఉన్నారు.

# తణుకులో ప్రశాంతంగా పోలింగ్

- ఉదయం నుంచి బారులు తీరిన ఓటర్లు
- తేతలి గ్రామంలో రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- నియోజకవర్గంలో 233 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్

**తణుకు:** సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో సోమవారం జరిగిన పోలింగ్ తణుకు నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం నియోజకవర్గంలో 233 పోలింగ్ కేంద్రాల్లో కొనసాగింది. తణుకు పట్టణంతో పాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగిసే సమయం వరకు ఓటింగ్ కొనసాగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి వరకు ఓటింగ్ జరిగింది. పోలింగ్ ముగిసే సమయం సాయంత్రం 6 గంటలకు ముందు క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. తణుకు మండలం మండపాక, తేతలి గ్రామాల్లో పోలింగ్ స్టేషన్లను సందర్శించిన రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు.

**రాత్రి 9 గంటలకు 82.07 శాతం పోలింగ్**
తణుకు నియోజకవర్గంలోని పోలింగ్ సరళి మందకొడిగా ప్రారంభమైంది. కొన్ని చోట్ల 20 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఉదయం 9 గంటలకు కేవలం 8.29 శాతం మాత్రమే పోలింగ్ నమోదు కాగా అనంతరం 11 గంటలకు 20.05 శాతం, మధ్యాహ్నం ఒంటి గంటకు 37.29 శాతం, 3 గంటలకు 52.56 శాతం, సాయంత్రం 5 గంటలకు 65.65 శాతం చొప్పున నమోదైంది. రాత్రి 9 గంటల వరకు 77.87 శాతం పోలింగ్ నమోదైంది. ఎండ వేడిమి కారణంగా సాయంత్రం ఒక్క సారిగా పోలింగ్ స్టేషన్లకు ఓటర్లు పోటెత్తారు. దీంతో కొన్ని పోలింగ్ స్టేషన్లలో రాత్రి సమాయంలో సైతం ఓటింగ్ కొనసాగింది. తణుకు మండలం తేతలి, మహాలక్ష్మిచెరువు, అత్తిలి జూనియర్ కళాశాల పోలింగ్ స్టేషన్లలో రాత్రి వరకు పోలింగ్ జరిగింది. తణుకు నియోజకవర్గంలోని 2,34,575 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,14,435 మంది కాగా మహిళలు 1,20,135, ఇతరులు 5 మంది ఉన్నారు. వీరిలో తణుకు అర్బన్ పరిధిలో 75,507, తణుకు మండలంలో 50,442, అత్తిలి మండలంలో 55,597, ఇరగవరం మండలంలో 53,029 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. సోమవారం రాత్రి 9 గంటల వరకు 1,79,815 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరలో పురుషులు 87,346 కాగా, మహిళలు 91,480 మంది ఉన్నారు.

**తణకు టౌన్:** సోమవారం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని పలు గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించారు. తణుకు పట్టణంలోని ఎస్కేఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, మాజీ మున్సిపల్ చైర్మన్ వంక రాజకుమారిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పైడిపర్రులోని 35వ పోలింగ్ బూత్‌లో వైఎస్సార్‌సీపీ మాజీ కోర్డినేటర్ చీర్ల రాధయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చీర్ల పద్మశ్రీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**అత్తిలి:** సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా అత్తిలి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, భార్య లక్ష్మీకిరణ్, వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, భార్య కీర్తి, కారుమూరి తల్లి సూర్యకాంతం ఓటు హక్కును వనియోగించుకున్నారు. వృద్ధురాలైన తల్లిని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వీల్‌చైర్‌లో పోలింగ్ కంపార్టుమెంట్‌కు తీసుకువెళ్లి ఓటు వేయించారు.

**ఇరగవరం:** మండలంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.


మండపాక గ్రామంలో పోలింగ్ సరళి తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి కారుమూరి


అత్తిలి: పోలింగ్ కేంద్రానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తన తల్లి సూర్యకాంతంను వీల్‌చైర్‌పై తీసుకువస్తున్న దృశ్యం


ఇరగవరం: కావలిపురంలో పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు


రాపాకలో ఓటు హక్కు వినియోగించుకున్న మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత

## ఓటర్లతో ఆడుకున్న ఎన్నికల అధికారులు

- సౌకర్యాల కల్పనలో ఘోరంగా విఫలం
- స్పృహతప్పి పడిపోయిన ఓటర్లు

**తాడేపల్లిగూడెం:** ఓటర్ల జీవితాలతో గూడెం నియోజకవర్గ ఎన్నికల అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఓటు హక్కు సజావుగా వినియోగించుకోడానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని పది రోజులుగా ఊదరగొట్టిన ఎన్నికల అధికారులు పోలింగ్‌రోజు సోమవారం వచ్చే సరికి చేతులెత్తేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీసం మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదు. ఎండలు అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో నీడ కల్పించేందుకు టెంట్‌లు ఏర్పాటు చేయలేదు. పట్టణంలోని కోడే వెంకట్రావు మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నాలుగు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. వృద్ధులను, నడవలేని వారిని పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లేందుకు వీలుగా వీల్ చైర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా, నాలుగు పోలింగ్ కేంద్రాలకు కలిపి ఒక వీల్ చైర్‌ను ఏర్పాటు చేశారు. ఎండ అధికంగా ఉండటంతో కోడే వెంకట్రావు హైస్కూల్‌లో ఒక యువకుడు ఎండకు తాళలేక ఫిట్స్‌తో రక్తం కక్కుతూ పడిపోయాడు. వృద్ధులు నిలువ నీడ లేక విలవిల్లాడిపోయారు. చాంతాడంత లైన్లలో ఎండకు నిలబడలేక తలపై చెట్టు కొమ్మలు పెట్టుకొని నిలబడ్డారు. పట్టణంలో పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో ఎన్నికల కమిషన్ అధికారులు సక్రమంగా ఏర్పాటు చేయలేకపోవడంతో స్థానిక పంచాయతీల సహకారంతో పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు సొంతంగా ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నికల నిర్వహణ అధికారుల తీరు పట్ల ఓటర్లు తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు.


ఎండ వేడిక తట్టుకోలేక పడిపోయిన యువకుడిని ఆస్పత్రికి తీసుకెళుతున్న పోలీసులు


ఎండకు తట్టుకోలేక తలపై చెట్టు కొమ్మలు నీడగా ఉంచుకున్న ఓటర్లు


ఓటు హక్కు వినియోగించుకొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన వృద్ధురాలు

## దొడ్డిపట్లలో ఓటు వేసిన అనంత శ్రీరామ్



**యలమంచిలి:** ప్రముఖ సినీ గేయ రచయిత చేగొండి అనంత శ్రీరామ్ తన స్వగ్రామం దొడ్డిపట్లలో సోమవారం తన ఓటు వేశారు. తన తండ్రి రిటైర్డ్ ప్రిన్సిపల్ సత్యనారాయణమూర్తి, బంధువు సీతారామస్వామి నాయుడుతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చిన శ్రీరామ్ సాధారణ పౌరుడిలా వరుస క్రమంలో నుంచి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# తణుకులో సంక్షేమం, అభివృద్ధి పరవళ్లు

- సంక్షేమం, అభివృద్ధికి రూ. 3,300 కోట్లు..
- 59 నెలల సంక్షేమ పాలనపట్ల హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం
- చదువుల విప్లవం, విద్య వైద్యానికి పెద్దపీట
- రహదారుల అభివృద్ధి

**తణుకు అర్బన్:** ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమం అందించిన తీరును ప్రజలు వేనోళ్ల పొగుడుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను సృష్టించి పారదర్శకంగా మహిళల ఖాతాల్లో నగదు జమ చేస్తున్న విధానాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. జగనన్న కాలనీలు పేరుతో అర్హులందరికీ సొంతింటి కలను సాకారం చేసి ప్రజల మనస్సును గెలుచుకున్నారు. తణుకు నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి రూ. 3,300 కోట్లు వెచ్చించి డీబీటీ, నాన్ డీబీటీల ద్వారాను, సుమారుగా రూ. 1000 కోట్లు నిధులతో వివిధ భవనాలు, రహదారుల అభివృద్ధి చేసిన వైనాన్ని సైతం ప్రజానీకం హర్షిస్తున్నారు.

**సంక్షేమం, అభివృద్ధి ఇలా...**
తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి నాలుగేళ్ల జగనన్న ప్రభుత్వ హయాంలో మౌళిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమానికిగాను రూ. 3,300 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో భాగంగా డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా సంక్షేమ పథకాలు, పింఛన్లు రూపంలో మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ. 2,298 కోట్లు జమ చేయగా, వివిధ అభివృద్ధి పనులకుగాను రూ. 1,003 కోట్లు ఖర్చుచేశారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలకు సంబంధించి అమ్మ ఒడి, విద్యాకానుక, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో విద్యావ్యవస్థకు అండగా నిలబడగా, కాపు నేస్తం, వైఎస్సార్ ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత వంటి పథకాలు లబ్ధిదారులకు ఆర్థికంగా అండగా నిలబడ్డాయి. అభివృద్ధిలో భాగంగా రహదారుల నిర్మాణాలు, సచివాలయ భవనాలు, ఆర్బీకే సెంటర్లు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, జలజీవన్ మిషన్ తాగునీరు, నాడు నేడు పాఠశాల భవనాలు వంటి నిర్మాణాలు జరిగాయి.



తణుకు మునిసిపాలిటీ భవనం



తణుకు పెరవలి రోడ్డులో ఏర్పాటు చేసిన ఐలవ్ తణుకు ముఖద్వారం